


# నిషేధం

ఆంగ్ల మూలం : గౌతం. ఎన్
అనువాదం : కొల్లూరి సోమశంకర్

నేను నా వాచీ కేసి చూసుకున్నాను. రాత్రి పదవుతోంది. దివ్యకి ఆలస్యం అయినట్లుంది. చుట్టుపక్కల చూసాను. షాపింగ్ మాల్ అంతా ఖాళీ అవుతోంది. అప్పటిదాకా షాపుల వద్ద తచ్చాడుతున్న జనాలు ఒక్కసారిగా పలచబడసాగారు. ఒక మూల నుంచి శుభ్రపరిచే స్త్రీ తన పని మొదలుపెట్టింది. ఒక కర్రకి కట్టిన తడిగుడ్డతో నేలను శుభ్రం చేస్తోంది. ఆ పనిని ఆమె కొన్ని లక్షల సార్లు చేసుంటుంది. మామూలుగా నాకీ 'మాల్స్' నచ్చవు. కొనుగోలు ఉన్మాదంలో పడికొట్టుకుపోవడం... డబ్బంటే లెక్కలేనితనం... నాకు పడవు.

నేను నా వాచీ కేసి మరో సారి చూసుకున్నా. దివ్య చెప్పింది నిజం! నాకిష్టం లేనప్పటికీ, ఇక్కడ ఈ మాల్‌లో వుండడం నాకో గొప్ప అనుభవాన్ని ఇచ్చింది.

''ఆ సమయంలో మనం జనం గురించి పట్టించుకోనక్కర్లేదు. కేవలం మనమిద్దరమే వుంటాం. దాని సహజ సిద్ధమైన లక్షణాలను ప్రదర్శించే ఓ స్థలాన్ని సామాజిక దృష్టి కోణం నుంచి గమనించడం అద్భుతంగా వుంటుంది...'' అంటూ ఎంతో నమ్మకంగా చెప్పింది దివ్య చిరునవ్వుతో. దివ్య చెప్పగా, చెప్పగా చివరకి ఒప్పుకున్నా. ఫలితమే- నేనిక్కడ...బెంగుళూరు శివార్లలో కొత్తగా వెలసిన ఈ షాపింగ్ మాల్‌లో వుండడం! ఇంకా దీని నిర్మాణం పూర్తి కాలేదు. కాని తచ్చాడడానికి కావలసినన్ని కొట్లు ఇప్పటికే ఈ షాపింగ్‌మాల్‌లో వచ్చేసాయి.

అక్కడ జరిగే సంఘటనలను సామాజిక దృష్టి కోణం నుంచి పరిశీలిస్తూ, దివ్య కోసం ఎదురు చూస్తున్నాను. ఆకలిని, విసుగుని దూరం చేయ డానికి ఇక్కడికి వచ్చేముందు కొనుక్కున్న ఫైవ్‌స్టార్ చాక్లెట్లలో ఒక దాన్ని నమలసాగాను (ఈ చాక్లెట్ లంటే విద్యకి కూడా ఇష్టమే) వ్యాపారస్తుల సందేహాస్పదమైన చూపులను తప్పించుకుంటూ, కాలక్షేపం కోసం వివిధ అంతస్థులలో తిరుగుతూ, తెరచి వుంచిన, మూసేస్తున్న కొట్లని గమనించ సాగాను. ఇంతలో శుభ్రం చేసే ఆమె వెనుక నాకో దృశ్యం కనపడింది.

అసంపూర్తిగా వున్న మూత్రశాలల వద్ద మసక వెలుతురులో ఓ పదేళ్ల అమ్మాయి, రెండేళ్ల అబ్బాయికి అన్నం తినిపిస్తోంది. ఆమె పాత నలిగిన దుస్తులను ధరించి వుంది. కాని అవెంతో శుభ్రంగా వున్నాయి. ఇంతలో ఆ పిల్ల గబగబా పరిగెత్తుకు వెళ్లి నేలని శుభ్రం చేస్తున్న ఆమెతో ఏదో మాట్లాడింది. వాళ్ల హావభావాలను బట్టి చూస్తే, వాళ్లిద్దరూ తల్లీకూతుళ్లలా అనిపిస్తున్నారు.

అమ్మపనిలో వుండడంతో తమ్ముడి బాధ్యతను తను తీసుకుందామ్మాయి. వాడికి తినిపించడం అయ్యాక, అక్కడున్న కాగితాలలోంచి ఒక శుభ్ర మైన దాన్ని ఏరి, వాడి మూతి తుడిచింది.

అక్కడ అందంగా అలంకరించబడున్న ఓ బల్లపై కూర్చుని నేను వాళ్లని గమనించసాగాను. శుభ్రం చేసే ఆమె నా దగ్గరగా వచ్చినప్పుడు ఆమెకి వీలుగా వుండేలా నా కాళ్లు పైకెత్తాను. ఆమె నాకేసి కృతజ్ఞతగా చూసింది. నేను చిన్నగా నవ్వాను. ఆమె కూడా నవ్వి తన పని చేసుకో సాగింది. ఇంతలో అక్కతో దాగుడుమూతలాడు తున్న ఆమె కొడుకు వచ్చి తల్లిని చుట్టేసుకున్నాడు. ఆమె వాడికేసి వాత్సల్యంగా చూసింది. నేను నా హ్యాండ్ బాగ్‌లోంచి ఓ ఫైవ్‌స్టార్ చాక్లెట్ తీసి వాడికందించాను. తీసుకోనా వద్దా అన్నట్లు అమ్మ కేసి చూశాడు. అమ్మ ఒప్పుకోగానే వాడి ముఖం వెలిగిపోయింది. స్వచ్ఛమైన ఆనందంతో అక్కని పిలుస్తూ పరిగెత్తాడు.

దివ్య వచ్చేవరకు నాకేం పనిలేదు. అందుకనే ఆమెను మెల్లగా మాటల్లోకి దింపాను. పైగా సమయం కూడా గడవాలి కదా! ఆమె కథ చాలా మంది పేద భారతీయ స్త్రీల లాంటిదే. పేరు శాంతమ్మ. మొగుడు తాగుబోతు. డబ్బుకోసం ఆమెని చితకబాదుతుంటాడు. పాపం శాంతమ్మే పిల్లలను చూసుకుంటోంది. కూతురు అప్పట్లో బడికి వెళ్లేది. కాని ఈ మధ్య తమ్ముడిని చూసు కోవడం కోసం ఇంట్లోనే వుండిపోతోంది. బతుకు భారమవుతోంది. కూతురు చిన్న చిన్న పనులు చే యడం ప్రారంభించి, క్రమంగా నిలకడగా డబ్బు సంపాదించసాగింది. పిల్లని చదివించలేకపోయినం దుకు శాంతమ్మకి బాధగా వున్నా, ఆమెకి మరో మార్గం లేదు. ఆ పిల్ల సంపాదించే కొద్ది డబ్బు తోనూ, శాంతమ్మ జీతంతోనూ ఆ కుటుంబం తమ కనీసావసరాలను తీర్చుకోగలుగుతోంది. వాళ్లకి సహాయం చేసేవాళ్లెవరూ లేరు.

శాంతమ్మ తన కథని ముగించి అక్కడినుంచి ముందుకు సాగిపోయింది. దివ్య ఇంకా రాలేదు. నాకు అసహనంగా వుంది. ఆమె సెల్‌కి రింగి చ్చాను. 'నెంబర్ నాట్ రీచబుల్' అని జవాబొ చ్చింది. 'వెధవ నెట్‌వర్క్' అని తిట్టుకున్నాను. మళ్లీ నా వాచ్‌కేసి చూసుకున్నాను. పది నలభై అయిదు అవుతోంది. అంతలో అక్కడి వచ్చిన ఆ షాపింగ్ మాల్ సెక్యూరిటీ గార్డు నాకేసి వింతగా చూసు కుంటూ వెళ్లిపోయాడు. ఇంకా రెండు కొట్లు తెరిచే వున్నాయి.

ఇంతలో ఆ అమ్మాయి తన భుజం మీద ఏవో కాగితాల కట్టని మోసుకుంటూ, తమ్ముడిని వెంటే సుకుని వచ్చింది. ఆడుకోమంటూ తమ్ముడి చేతిలో కొన్ని కాగితాలు పెట్టి తన పనిలో నిమగ్నమై పోయింది. ఆమె ప్రతి షాపుకి వెళ్లి షట్టర్‌కి నేలకి మధ్య వున్న ఖాళీ లోంచి లోపలకి కాగితాలు విసరసాగింది. అదేదో నోటీసులా వుంది. ఇంతలో దివ్య నవ్వుతూ రాసాగింది. నేను ఆమెని ఆగమన్న ట్లుగా సైగ చేసాను. నేను నిలుచున్న షాపు దగ్గరకి ఆ పిల్ల రాగానే నేను ఉత్సుకత ఆపుకోలేక ఓ కరపత్రాన్ని తీసుకొని చదవసాగాను.

చదవడం పూర్తి కాగానే, అందులోని అసం బద్ధతని గ్రహించాను. నాకు కోపం పెరిగిపోవడం తెలుస్తోంది. అంతలోనే నన్ను నిస్సహాయత ఆవరించింది. ఏమీ చేయలేక గట్టిగా నవ్వేసాను. ఆ పిల్లకేమీ అర్థం కాలేదు. నన్ను పట్టించుకోకుండా, తన కుటుంబానికి 'అన్నం' పెట్టే ఆపనిలో నిమగ్నమైపోయింది.

దివ్య నా చేతిలోంచి ఆ నోటీసుని తీసుకొని చదవసాగింది.

**''భారత ప్రభుత్వపు హెచ్చరిక...**

14 ఏళ్లలోపు బాల బాలికలతో పనే చేయించు కోవడాన్ని చట్టరీత్యా నిషేధించడమైనది. మీ షాపులలో అటువంటి బాల బాలికలెవరైనా వుంటే వారిని 30సెప్టెంబరు 2006లోపు తొలగించి, ప్రభుత్వంతో సహకరించగలరు...''

నేను ఆ పిల్లకేసి నడిచాను. నా దగ్గర మిగిలి వున్న ఓ చాక్లెట్‌ని ఆమెకిచ్చాను. ఆ పిల్ల ముఖం సంతోషంతో వెలిగిపోయింది. నాకేసి కృతజ్ఞతగా చూసింది. ఆమె చూపులని తప్పించుకొని దివ్యను తీసుకొని ఆ మాల్ నుంచి బయటపడ్డాను. నాకీ రోజు ఎదురైన అనుభవాన్ని కొన్నాళ్ల వరకూ, బహుశా కొన్నేళ్ల వరకూ కూడా మరిచిపోలేనేమో! యాభైరెండేళ్ల వయసులో, నా కూతురి చేయి పట్టుకొని నడుస్తున్న నాకు ఓ సమస్య ఎదురైంది. మరొకరి కూతురి విషయంలో భారత ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం సబబేనా కాదో నేను తేల్చుకోలేకపోతున్నాను. ★

